# పాలు - నీళ్లు

" మనం ఈరోజు చాలదూరం ప్రయాణం చేయవల్సివుంది. ఏదేని విషయం మీద చర్చించుకుందాం" అన్నాడు టీచర్.

పిల్లలు ఉత్సాహంగ 'సరే' అంటు సర్దుకుని కూర్చున్నారు.

వాళ్ల ఉత్సాహాన్ని గమనించిన టీచర్ "ఒకే విషయం మీద కాకుండా పలు విషయాల మీద మాట్లాడుకుందాం" అన్నాడు.

'సరే' అని తలలాడించారు అందరు.

"అయితే ఒక్కొక్కరు మీ మీ ఊళ్లల్లో జరిగిన,జరుగుతున్న వింతలు చెప్పండి." అందరి కంటె ముందు మూర్తి మొదలుపెట్టాడు. " సార్ మా ఊళ్లో రెండు గుట్టలున్నాయి. గుట్టల మధ్య ఓ పశువులకాసే పిల్లవాడు తనచేతికర్రతో ఓ చిన్న గుంట తవ్వాడు, ఆ గుంటలో కొంచం తెల్లని పాలవలె నీళ్లు ఊరినయి సార్. అదే విషయం ఊళ్లో చెప్పాడు. ఊరివాళ్లు వెళ్లి ఆ గుంటను ఓ చెలమలాగ తవ్వారు. అవే నీళ్లు కొంచెం రంగుమారి కొబ్బెరి నీళ్లలాగ ఊరినయి. సార్ వాటి రుచి కూడ కొబ్బెరినీళ్లలాగె వుండి వాటిని తాగితే రోగాలు నొప్పులు పోతువున్నాయి అన్నారు. యిక అక్కడికి జనం రాకపోకలు పెరిగాయి సార్".

"అక్కడికి ఓ పూజారి చేరి అందులోని నీళ్లు చెంచాలతోటి జనం నాలికలమీద పోస్తూ వున్నాడా?"

"చెంచాడుకాదు సార్ ప్రతిమనిషికి ఓ చెంబెడు ముంచియిచ్చినా ఆ చెలిమలోని నీళ్లు అంతెవుంటున్నాయి. సార్".

" ఇక అక్కడ తిరునాలు జరుగుతున్నాయా".

"ఎక్కడిమంది సార్, బండ్లల్ల, కార్లల్ల కాలినడకన ఎక్కడెక్కడినుండో రావటం".

"ఇప్పటికి అలాగె వస్తువున్నారా?"

"ఇప్పుడు అక్కడ నీళ్లు ఊరటంలేదు సార్.

" ఎందువల్లా"

" ఎవరో పాపాత్ముడు స్వయంగా తానె చెంబు ముంచుకుండట అప్పటినుండి అది యింకి పోయింది సార్".

టీచర్ నవ్వుతూ " అదంతెమూర్తి, ఎండిపోయివుంటుంది. గుట్టలు యింకించుకున్న వర్షపు నీరు కిందకు జారి అడుగుబాగాన జాలు వారేది మనకు తెలుసు".

" అదివానకాలంలోనే కదా. ఎండకాలంలో కూడ నీళ్లు ఊరినయి సార్"

" ఊరుతాయి. తేమవున్నంతవరకు వస్తాయి. ఆ తరువాత ఎండిపోతుంది. అప్పటివరకు వొచ్చిన నీటిని మీ ఊరి వాళ్లను పవిత్ర జలమని నమ్మించి సొమ్ముచేసుకున్నారు. అది మామూలుగ ఎండిపోగానె ఎవరో పాపాత్ముడు తానె చెంబును ముంచాడు అన్నారు. అందరిలో పెంచిన నమ్మకాన్ని ఒట్టిగ వదిలితె జనం తిరగబడతారుగ, అందుకని మరో మాయ మాటను చెప్పి నమ్మించారు. ఈ రెండు చోట్ల నమ్మకమే పనిచేసింది.

మరో విద్యార్థి రెడ్డి, టీచర్ వైపు చూస్తు --

" సార్ మావూర్లల్లో ఆరుకాళ్ల ఆవుదూడ పుట్టింది సారు. అది భగవంతుని అవతారమని జనం తండోపతండలు వచ్చి పూజలు చేశారు".

" ఆ తరువాత"

" దానిని ఓ సాధువుకు యిచ్చేశారు సారు"

" అతను దానికింత పసుపు - కుంకుమ పూసి ఊరూర తిప్పి పొట్ట పోసుకుంటుండొచ్చు. అసలు మనదేశంలో ఆవు అంటేనే భక్తి భావంకదా?"

"ఎందువల్లా కావొచ్చు సార్" రహీం ప్రశ్న.

" అది మనకు పాలుయిస్తుంది, దూడలను యిస్తుంది, కోడెలను యిస్తుంది, అవి అరక దున్నుతాయి. బరువులను లాగుతాయి" అంటు చిరునవ్వుతో ముగించాడు.

" మరి గేదే పాలిస్తుంది, దూడలనిస్తుంది, దున్నలనిస్తుంది, అరక దున్నుతుంది. బరువులాగుతుంది కదసార్, మరి గేదేను పూజించరుకదా సార్"మళ్ళి రహీం ప్రశ్న.

" రహీం మంచి ప్రశ్నే వేశాడు. కాని దానికి జవాబు ఎవరు చెపుతారు.'

''' మీరేమంటారు సార్?"

" మీ సందేహం కరక్టే అంటాను. ఆవు యిచ్చేపాలను కూడ మనం ఆహారంగా స్వీకరించ వల్సింది పోయి, వాటిని యజ్ఞయాగాల పూజలకు వాడుతు గోవు పవిత్రమైందని ప్రకటింది ఆ నమ్మకాలనే పెంచిపోషిస్తు, వచ్చారు కాని మనకు రెండు సమానమే".

శర్మ కాస్త కదిలి కూర్చుంటు --

"మాకు ఊరి ప్రక్కన చెరువువుంది. దాని కట్ట కొమ్ముగ ఓ పుట్టవుంది. ఆ పుట్టలో ఓ నాగుపాము వుందట. ఎవరింట్లో శుభకార్యం జరిగినా ఆ పుట్టకు పూజచేస్తారు. పాలు పోస్తువుంటారు. నాగులచవితినాడు ఊరంతా వెళ్లి చెంబులకొద్దిపాలు పోస్తారు. అందులోని నాగుపాము ఈ పాలను తాగుతదా సారు".

" ఈ ప్రశ్న పోసేవాళ్లనే అడగాలి, అది పెంపుడు ప్రాణికాదు. ఇక పాలు పోస్తున్నరంటే మనదేశంలో వున్న జాడ్యమే, మనిషికి తిండిలేకున్న దేవుళ్లకు నైవేద్యాలు పెడుతారు. వాస్తవానికి దేవునికి ఈ తిండి, వస్త్రాలు, ఆభరణాలు అవసరంలేదు. వాటిపేరు మీద కోటానకోట్ల మానవ సంపాదన మరుగున పడిపోతుంది. మనదేశంలో వున్న వనరులే తక్కువ ఆ తక్కువ. ఉత్పత్తులను సద్వినియోగం

చేసుకోలేకపోతున్నాం. దీనికి కారణం మనవాళ్ల నాటిన మూఢనమ్మకాలే." మీరంతా పెద్దవాళ్ళై బాగా చదువుకొని, సమాజంలో ఇప్పుడున్న మూఢనమ్మకాలను తొలగించి శాస్త్రీయ ఆలోచనలు పెంచి, మానవ వనరులను అభివృద్ధి వైపు మలుపు తిప్పాలి.

" సార్, ఎదురుగ ధాభా వుంది" టి తాగుదామా అంటు డ్రైవర్ వ్యాన్ స్లో చేశాడు.

" సరె" అన్నాడు టీచర్. ధాబా ముందు వ్యాన్ ఆగింది

" సత్యం ముందుగా వ్యాన్ దిగుతూ--"

" ఈ సందర్భంగా నాకో కవిత గుర్తొస్తుంది.

" పాము పుట్టలో పాలు. " ".పాపాయి నోట్లో వేలు!"

అబ్బా ఏం చెప్పాడయ్యా ఆ మహానుభావుడు" అన్నాడు. విద్యార్థులు స్పందిస్తూ అవే కవితా పాదాలను పలుకుతు దిగారు.